సాక్షి మెదక్

ఆదివారం, 4, జూన్, 2023



అందోల్ ఎమ్మెల్యేకు నిరసన సెగ

టేక్మాల్(మెదక్): మండలంలోని కాదులూర్ గ్రామంలోకి రావొద్దంటూ ఆ గ్రామ మహిళలు అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

10లో



మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు

నర్సాపూర్: రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతా రెడ్డి శనివారం సచివాలయంలో కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.



నర్సాపూర్ ఎమ్మెల్యే పూజలు

తూప్రాన్: పట్టణ సమీపంలోని పెద్ద చెరువు కట్టపై ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో నర్సాపూర్ ఎమ్మెల్యే మాధన్‌రెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పూజారి ఆత్రేయశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

మెదక్ కలెక్టరేట్: విద్యాసంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్ డిమాండ్ చేశారు. శనివారం అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో డీఈఓ రాధాకిషన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శశికాంత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు తొందరగా పంపిణీ చేయాలన్నారు. పర్మిషన్ లేకుండా బ్రాంచ్‌ల పేరుతో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేసి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపామన్నారు. లేనిపక్షాన ఏబీవీపీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ ఉదయ్, నాయకులు నితిన్, బద్రి భాను, సంతోష్ పాల్గొన్నారు.

శారీరక శ్రమ లేకనే వ్యాధులు



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

మెదక్‌జోన్: శారీరక శ్రమ లేకపోవటంతో వ్యాధులు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉంటుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ చందూనాయక్ అన్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో సైకిల్‌ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక శ్రమ లేకపోవటం, ఆహార అలవాట్లు, గాలి కాలుష్యం, ధూమపానం, మద్యపానం సేవించడం వల్ల రక్తపోటు, మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు, రకరకాల కేన్సర్లు, వచ్చే అవకాశం ఉందన్నారు. సైకిల్ తొక్కటం వల్ల రోగాన్ని నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధురి, వైద్యురాలు స్నేహ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట జయప్రదం చేయాలి



అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు కరపత్రం అందజేస్తున్న హెచ్‌ఎం, విద్యార్థులు

వెల్దుర్తి(నర్సాపూర్): బడి బయట ఉన్న బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు ఏర్పాటు చేసిన బడి బాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పిలుపునిచ్చారు. రైతు దినోత్సవంలో పాల్గొనేందుకు వెల్దుర్తికి వచ్చిన అదనపు కలెక్టర్‌కు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సాంబయ్య బడిబాట కరపత్రం అందజేశారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాల్లో 10/10, 9/10 జీపీఏ సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాధించిన ఫలితాలను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఇంటింటికీ అందజేసి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది బాలరాజ్, సునిత, బ్రహ్మలత, భవాని తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న న్యాయమూర్తి జితేందర్

మెదక్ కలెక్టరేట్: ఈనెల 10వ తేదీన కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ తెలిపారు. శనివారం మెదక్‌లోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ప్యానల్ లాయర్స్, బ్యాంకు ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్స్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్స్‌తో కోఆర్డినేషన్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించుకునే విధంగా న్యాయవాదులు సహకరించాలన్నారు. ఈ సదావకాశాన్ని ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఎల్‌ఏసీ, జేఎస్‌ఏ ఎం రీటా లాల్‌చంద్, జేఎస్‌సీ కల్యాణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయాలనే..

- స్వరాష్ట్రంలో వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



పెద్దశంకరంపేట: రామోజిపల్లిలో ఎడ్లబండి ర్యాలీలో పాల్గొన్న నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



హవేళిఘణాపూర్: బూరుగుపల్లిలో రైతు దినోత్సవ సంబురంలో డప్పు కొడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



శివ్వంపేట: గోమారంలో రైతు వేదికను ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి



అల్లాదుర్గం: ముస్లాపూర్ రైతు ర్యాలీలో అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మెదక్ రూరల్: రైతును రాజు చేయడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేసి వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం హవేళిఘణాపూర్ మండలం బూరుగుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలోని పెద్దమ్మ దేవాలయం నుంచి రైతు వేదిక వరకు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లలో రైతులతో కలిసి డప్పుచప్పుళ్లు, బోనాల ఊరేగింపు, సాంస్కృతిక నృత్యాలు చేస్తూ భారీ ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. మండుటెండల్లోనూ చెరువులు జలకళ సంతరించుకొని సాగునీరు పుష్కలంగా ఉండటంతో పల్లెలు పచ్చటి పంటలతో కళకళలాడుతున్నాయన్నారు. రైతులు ఈ విషయాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెన్నాగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్, రాగి అశోక్, సాయిలు. శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమంపై చర్చ జరగాలి



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు .చిత్రంలో కలెక్టర్ రాజర్షిషా

రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిపై గ్రామాల్లో చర్చించాల్సిన అవసరముందని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్, రఘునందర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం కలెక్టర్ రాజర్షిషాతో కలిసి మండల పరిధిలోని గోమారంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు రైతులు ఏర్పాటు చేసిన ఎడ్లబండిపై ఊరేగింపుగా సభాస్థలికి వచ్చారు. ప్రభుత్వం సాగువిస్తీర్ణం పెంచాలనే ఉద్దేశంతో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు నష్టపోరాదనే ఉద్దేశంతో పంటకాలాన్ని ఒక నెల ముందుకు జరిపిందన్నారు. కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. మండలంలో కొత్తగా గోదాముల నిర్మాణం, క్లస్టర్ల పెంపు చేపట్టాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ కోరారు. నవాబుపేటలో భూసమస్యల వల్ల కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు రాకపోడంతో రైతులు నష్టపోతున్నారని, సమస్య పరిష్కరించాలని సర్పంచ్ అశోక్‌రెడ్డి కోరాగా, అందుకు కమిషనర్ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లావ్యవసాయ అధికారి ఆశాకుమారి, ఆర్డీఓ శ్రీనివాసులు, మండల ప్రత్యేక అధికారి నర్సయ్య, ఆత్మకమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతులపై అసహనం

రైతు సదస్సులో సరైన వసతులు కల్పించకపోవడంపై కలెక్టర్ రాజర్షిషా అసహనం వ్యక్తం చేశారు. సభావేదిక బాగలేకపోవడం, వేసవి ఎండల దృష్ట్యా టెంట్‌లో, వేదికపై ఫ్యాన్లు, కూలర్లు ఏర్పాటు చేయకపోవడంతో ఉడకపోతతో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం దొంతిలో నిర్మించిన రైతు వేదికను కలెక్టర్ రాజర్షిషా ప్రారంభించారు.

108 కలశాలతో ఊరేగింపు



ఊరేగింపుగా వస్తున్న మహిళలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షిక వేడుకలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ దేవాలయం నుంచి 108 కలశాలను మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, నగేష్, కూన రాములు, భక్తులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యుల్డు కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో పదోతరగతిలో 7.0 జీపీఏ కంటేఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ ఈపాస్ నందు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం ఈనెల 11వ తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, గురుకులాలు, ఆశ్రమ ప్రభుత్వ వసతి గృహాల్లో, కేజీబీవీ పాఠశాలల్లో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.

రేపటి నుంచి ఇంటర్‌అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

మెదక్ కలెక్టరేట్: ఈ నెల 5వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని నోడల్ ఆఫీసర్ సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా సోమవారం నుంచి 9వ తేదీ వరకు ప్రాక్టికల్స్ మెదక్‌లోని బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతాయన్నారు. థియరీ పరీక్షలు ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం ఫస్ట్‌ఇయర్, మధ్యాహ్నం సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఎగ్జామ్స్ ఉంటాయని, 6681మంది హాజరవుతున్నారన్నారు.

ఏం చేశారని రైతు సభలు

బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): రైతులకు ఏం మేలు చేశారని దశాబ్ది ఉత్సవాల పేరుతో రైతు సభలు నిర్వహిస్తున్నారని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి ప్రశ్నించారు. శనివారం చిన్నశంకరంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని అన్నారు. రైతులు అకాల వర్షంతో పంట నష్టపోతే ఇప్పటివరకు నష్ట పరిహారం సంగతి తేల్చలేకపోయారన్నారు. రైతులకు లబ్ధి చేకూర్చే పనులు చేయకుండా మోసం చేశారన్నారు. అరకొరగా పండిన పంటను కొనేందుకు కొర్రీలు పెట్టిందన్నారు. ందుకు రైతులను మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగరాజు, శ్రీకాంత్ ఉన్నారు.

రైతు సంబరాలెందుకు ?



రైతు వేదికను ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్

నర్సాపూర్‌లో రైతువేదిక ప్రారంభోత్సవాన్ని కాంగ్రెస్ నేతలు అడ్డుకునే యత్నం



కాంగ్రెస్ నేతలు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులు గౌడ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నర్సాపూర్: రైతు వేదిక ప్రారంభోత్సవ కార్యక్రమం ఉద్రిక్తతగా మారింది. అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు రైతు వేదికను శనివారం ప్రారంభించేందుకు ప్రయత్నించగానే టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అక్కడకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పట్టించుకోని రైతు సంబరాలెందుకని, కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పేరుకుపోయాయని, వాటిని తూకం వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం డౌన్‌డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రైతు వేదిక ప్రారంభాన్ని అడ్డుకునేందుకు రాగానే సీఐ షేక్‌లాల్ మదార్, ఎస్ఐ శివకుమార్‌లు తమ సిబ్బందితో నిలిపివేశారు. అయినా కొందరు కాంగ్రెస్ నాయకులు రైతు వేదిక దగ్గర వచ్చారు. దీంతో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు వచ్చి పోలీసులతో కలిసి కాంగ్రెస్ నాయకులను బయటకు నెట్టి వేయడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అనంతరం పోలీసులు కాంగ్రెస్ నాయకులను అక్కడి నుంచి కొంత దూరం తీసుకెళ్లారు. జాతీయ రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రాస్తారోకో చేశారు.అంతకుముందే ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్‌లను బలవంతంగా పోలీసు వాహనంలో స్టేషన్‌కు తరలించారు. ఎంపీపీ జ్యోతి, రిజ్వాన్, మల్లేష్, అజ్మత్‌అలీ, సురేష్ ,అశోక్, మల్లేష్‌యాదవ్, తదితరులు రాస్తారోకో కొనసాగించారు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

రైతు వేదిక ప్రారంభం

నర్సాపూర్‌లోని రైతు వేదికను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్ పలువురు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, జెడ్పీటీసీ బబియానాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ నయిమోద్దీన్, వైస్ ఎంపీపీ నర్సింగ్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు శేఖర్, పట్టణ శాఖ అధ్యక్షుడు భిక్షపతి, ఏడీఏ సురేఖ, ఏఓ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇవ్వడానికి వెళితే...

రైతు వేదిక వద్దకు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి వస్తున్నారని తెలిసి రైతుల సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇవ్వడానికి వెళితే బీఆర్‌ఎస్ గుండాలను పెట్టి పోలీసుల అండతో తమను అడ్డుకుని నెట్టివేశారని ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్‌లు ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు.

పకడ్బందీగా ఉండాలి

దశాబ్ది ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్



నూతనంగా నిర్మించిన డీసీసీ బ్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: దశాబ్ది ఉత్సవ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నందున ఎలాంటి లోటుపాట్లు రానీయొద్దని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. శనివారం మెదక్ పట్టణంలోని సాయిబాలాజీ గార్డెన్స్‌లో ఈనెల 5న నిర్వహించే విద్యుత్ విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం వైస్రాయ్ గార్డెన్‌లో ఏర్పాటు చేస్తున్న సురక్షా దినోత్సవం, బడాఖానా కార్యక్రమాలను పరిశీలించారు. భోజనాలకు ఇబ్బంది కలగకుండా తగు ఏర్పాట్లు చేయాలని విద్యుత్ అధికారులకు సూచించారు. మెదక్ పట్టణంలో నూతనంగా నిర్మించిన డీసీసీబీ బ్యాంకు భవనాన్ని సందర్శించారు. మంత్రి చేతుల మీదుగా ప్రారంభానికి ముస్తాబు చేయాలన్నారు. అనంతరం మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన ఏర్పాట్ల పనులు, సభ ఏర్పాట్లను పర్యవేక్షించాలని డీఆర్డీఓ శ్రీనివాస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ హనుమంతరెడ్డి, పంచాయత్‌రాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్, ఆర్డీఓ సాయి రాం, తహసీల్దార్ శ్రీనివాస్, నవీన్ తదితరులు ఉన్నారు.

దుర్గమ్మ పల్లకీ సేవ



పాపన్నపేట(మెదక్): పౌర్ణమి పురస్కరించుకొని ఏడుపాయల దుర్గాభవానీమాతకు పల్లకీసేవ నిర్వహించారు. శనివారం సాయంత్రం వేళ దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, ఉత్సవ విగ్రహాన్ని వేద బ్రాహ్మణులు పూలతో అలంకరించారు. అనంతరం ఆవిగ్రహాన్ని పల్లకీపై ఉంచి ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈఓసార శ్రీనివాస్, పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెలో రేషన్ డీలర్లు

మెదక్‌జోన్: రేషన్ డీలర్లు శనివారం నుంచి సమ్మెకు దిగారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు బియ్యం ఇచ్చేది లేదంటున్నారు. ఈ డిమాండ్లన్నీ గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినవేనని వారు స్పష్టం చేస్తున్నారు. సమ్మె కొనసాగితే పేదలకు సకాలంలో బియ్యం అందక ఇబ్బందులు నెలకొనే అవకాశముంది.

- జిల్లాలో 520 రేషన్‌షాపులు.. డీలర్లు 495 మంది ఉన్నారు. ప్రతినెలా 3,800 మెట్రిక్ టన్నుల బియ్యం 2,14,890 కార్డులకు సరఫరా చేస్తారు
- ఇందులో ఫుడ్ సెక్యూరిటీ కార్డులు 2,00,967, అన్నపూర్ణ 13,854 అంత్యోదయ 69 కార్డులు ఉన్నాయి. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేస్తారు.

డీలర్ల డిమాండ్లు ఇవీ

- ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రజలకు బియ్యం ఇస్తున్నామని, మరోపని చేసుకునే పరిస్థితి లేనందున ఒక్కో డీలర్‌కు ప్రతినెలా గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలన్నది వారి ప్రధాన డిమాండ్.
- రూ.10 లక్షల విలువ చేసే ఆరోగ్య బీమా కల్పించాలి. ఏదైనా ప్రమాదం జరిగితే సదరు డీలరు కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకు వెంటనే బీమా అమలు చేయాలి.
- కరోనా సమయంలో రాష్ట్రవ్యాప్తంగా 99 మంది చనిపోయారని, ఆ కుటుంబాలకు ఎలాంటి నిబంధనలు లేకుండా కారుణ్య నియామకం ద్వారా రేషన్ డీలర్‌గా ఎంపిక చేయాలి.
- చనిపోయిన ప్రతీ డీలర్ కుటుంబానికి రూ. 50 వేలు అందజేయాలి.
- ప్రతి ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్ద వేబ్రిడ్జిలు ఏర్పాటు చేసి హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలి.
- షాపులు నడిపించే డీలర్లకు శాశ్వత లైసెన్స్‌లు ఇవ్వాలి.

డిమాండ్లు పరిష్కరించే వరకు..



తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె ఆపేదిలేదు. గతంలోనే ప్రభుత్వం ముందు మా డిమాండ్లు ఉంచాం. నేటికి వాటిని నెరవేర్చలేదు. అందుకే సమ్మెకు వెళ్లాల్సి వచ్చింది.

– ఆనంద్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు



హవేళిఘణాపూర్: కూచన్‌పల్లిలో మూసిఉన్న రేషన్ దుకాణం

విద్యను ప్రైవేటీకరణ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఎస్ఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు ప్రసాద్



మాట్లాడుతున్న ప్రసాద్

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం విద్యను ప్రైవేటీకరణ చేసే కుట్ర చేస్తుందని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర ప్రసాద్ అన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా విద్య, వైజ్ఞానిక శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. 3వరోజు శనివారం ముఖ్యఅతిథిగా ప్రసాద్ హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పాఠ్యపుస్తకాలలో చరిత్రను తొలగిస్తుందని ఆరోపించారు. శాస్త్రీయ ఆలోచన వైపు విద్యార్థులు వెళ్లకుండా మూఢనమ్మకాలను ఆర్య పురాణాలను పుస్తకాల్లో ఉండేలా కేంద్ర ప్రభుత్వం చేస్తుందని మండిపడ్డారు. ఒక పక్క శాస్త్రవేత్తలు కొత్త విధానాన్ని కనుగొనే దశలో ఉంటే, కేంద్ర ప్రభుత్వం మాత్రం వెనక్కి నెట్టేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర మహిళా నేత పూజ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రశాంత్, అనిల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్, సంతోష్, ఉపాధ్యక్షుడు జగన్, సహాయ కార్యదర్శి అజయ్, జిల్లా కమిటీ సభ్యులు నవీన్, రాకేష్, నాయకులు అనిల్, రాజు, అమూల్య, అనూష పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్మార్ట్‌గా సైబర్ మోసం

మోసపోయిన ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి కథనం ప్రకారం ... అమీన్‌పూర్ కృష్ణదేవరాయ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి గత ఏప్రిల్ 20వ తేదీన ఆయన ప్రమేయం లేకుండానే క్రెడిట్ కార్డుకు సంబంధించి మొబైల్ సందేశం వచ్చింది. సందేశాన్ని ఓపెన్ చేయగానే క్రెడిట్ కార్డు నుంచి లక్షా నాలుగు వేల రూపాయలు కట్ అయ్యింది. మోసపోయినట్టు గుర్తించి సైబర్, అమీన్‌పూర్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో పట్టణంలోని జయలక్ష్మీనగర్ కాలనీలో ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఏప్రిల్ 19వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం అంటూ సందేశం వచ్చింది. ఆ సందేశాన్ని ఓపెన్ చేసి రూ.1.40 లక్షలు చెల్లించి వారు ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. అయినా డబ్బులు ఇవ్వక పోవడంతో మోసపోయినట్టు గుర్తించి అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కొల్చారం(నర్సాపూర్): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. మండల పరిధిలోని రంగంపేటలో ఈ విషయం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన పోరాడి దుర్గపతి తెలిపిన వివరాల ప్రకారం... మూడు రోజుల క్రితం కొల్చారంలో శుభకార్యం ఉండడంతో ఇంటిల్లిపాది తాళం వేసి వెళ్లారు. శనివారం ఉదయం వచ్చి చూడగా ప్రధాన ద్వారానికి వేసిన తాళం తీసి ఉంది. మరో గది తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదుతో పాటు తులం విలువ గల చెవి కమ్మలు, చేతి ఉంగరం ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలను రాబట్టడంతో పాటు, తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉండవచ్చన్న ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

వ్యక్తి రిమాండ్

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని వరిగుంతంలో తిమ్మయ్య గారి మొగులయ్య ఇంట్లో చోరీ జరిగిన విషయం విదితమే. శనివారం కొల్చారం ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిఘా బృందం చోరీకి యత్నించిన ఇదే మండలం నాయిని జలాల్ పూర్‌కు చెందిన నీరుడి కృష్ణ అలియాస్ డబ్బుగల్ల కృష్ణను అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం దొంగలించిన సొమ్మును రికవరీ చేశారు. కృష్ణపై కేసు నమోదు చేసి, జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

లారీ బోల్తా

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల సమీపంలో రాజీవ్ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఇసుక లారీ బోల్తా పడింది. కరీంనగర్ వైపు నుంచి హైదరాబాద్ వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలయ్యాయి. త్రీటౌన్ పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా లారీని పక్కకు తొలగించారు. ప్రమాదంపై ఫిర్యాదు అందలేని త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని జంగమాయిపల్లి గ్రామ శివారులో బైక్‌పై నుంచి పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలంలోని నాగ్‌ధర్ గ్రామానికి చెందిన సాకలి సాయిలు(30) శనివారం మండలంలోని రుద్రారం గ్రామంలో శుభకార్యానికి వచ్చాడు. తిరిగి సొంతూరుకు వెళ్తుండగా ఫిట్స్ రావడంతో బైక్ పైనుంచి కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలై ఘటన స్థలంలో మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

అందోల్ ఎమ్మెల్యేకు నిరసన సెగ

- కాదులూర్‌లోకి రావొద్దు
- రోడ్డుకు అడ్డుగా ముళ్ల కంచెలు... ఖాళీ బిందెలతో మహిళల బైఠాయింపు


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న కాద్లూర్ మహిళలు

టేక్మాల్(మెదక్): మండలంలోని కాదులూర్ గ్రామంలోకి రావొద్దంటూ ఆ గ్రామ మహిళలు అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పర్యటనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్రామంలోకి ఎవరూ రాకుండా ముళ్ల కంచెలు, ఖాళీ బిందేలతో మహిళలు దారిపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. శనివారం రైతు దినోత్సవం సందర్భంగా టేక్మాల్ మండలంలోని కాదులూర్‌లో ఏర్పాటు చేసిన రైతు సమావేశానికి ఎమ్మెల్యే వస్తున్నారన్న విషయం తెలుసుకుని మహిళలు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న మండల పోలీసులు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వీరప్పతో పాటు నాయకులు గ్రామానికి చేరుకుని, వారితో మాట్లాడారు. తమ గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, మురికి కాల్వలు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా, ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. మీ గ్రామానికి సంబంధించిన సమస్యలు ఎమ్మెల్యేతో మాట్లాడి పరిష్కరిస్తామని పోలీసులు నచ్చజెప్పారు. దీంతో వారంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

పార్టీలకు అతీతంగా అందోల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని అందోలు ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. శనివారం మండలంలోని కాద్లూర్‌లో నిర్వహించిన రైతు దినోత్సవంలో ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి జమ్లానాయక్, సర్పంచ్ యాదయ్య, మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు విక్రమ్‌గౌడ్, సలీం, అవినాశ్, శివకుమార్, యాదయ్య, వసంత్, బన్సిలాల్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

కాదులూర్ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య వెంటనే పరిష్కరిస్తామని గ్రామీణ నీటి సరఫరా జిల్లా అధికారి కమలాకర్ తెలిపారు. గ్రామంలో తిరుగుతూ తాగునీటి సమస్యపై వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు త్వరలోనే ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మిస్తామన్నారు.


భక్తుల వీరప్పను నిలదీస్తున్న మహిళలు

రైస్ మిల్లులో అగ్నిప్రమాదం

రూ.కోటి ఆస్తినష్టం

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన పట్టణ శివారులోని నటరాజ్ మోడ్రన్ బిన్నీరైస్ మిల్లులో శనివారం చోటు చేసుకుంది. మిల్లు యజమాని బాశెట్టి బుచ్చిరాములు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్న సమయంలో మిల్లులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగాయని, మంటలు మిల్లు అంతా వ్యాపించడాన్ని గమనించి స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చినట్లు తెలిపా రు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాద సమయంలో మిల్లులో సుమారు రూ.2.20 కోట్ల విలువ గల ధాన్యం ఉందని, అందులో సుమారు రూ.కోటి ఆస్తి నష్టం జరిగిందని మిల్లు యజమాని వాపోయారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య

అక్కన్నపేట(హుస్నాబాద్): అప్పుల బాధతో ఓ ఆర్టీసీ డ్రైవర్ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి పంచాయతీ పరిధి చౌటకుంట తండాలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం తండాకు చెందిన మాలోతు మోబి(53) హుస్నాబాద్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు నెలల క్రితం జహీరాబాద్‌కు బదిలీ అయ్యాడు. తండా నుంచే విధులకు వెళ్తూ వస్తూ ఉండేవాడు. వార క్రితం గండిపల్లికి వచ్చిన మోబి, చేతికి స్వల్ప గాయం కావడంతో ఇంటి వద్దనే ఉన్నాడు. ముగ్గురు కూతుర్లకు పెళ్లిళ్లు చేశాడు. పెళ్లిళ్లకు సుమారు రూ.6లక్షల అప్పు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక నిత్యం మదనపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో శనివారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సక్కు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.

దుబ్బాక: ఆర్థిక సమస్యలు తాళలేక ఆటో డ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాయపోల్ మండల కేంద్రంలో శనివారం జరిగింది. రాయపోల్ ఎస్సై షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ షారుక్‌ఖాన్(24) ఆటో డ్రైవర్‌గా పని చేసుకుంటూ.. కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉండేవాడు. కుటుంబ పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడం, గతంలో ఉన్న అప్పులు తీర్చడానికి షారుక్ ఖాన్ తండ్రి జహంగీర్ దుబాయ్‌కు వెళ్లివచ్చాడు. షారుఖ్ చెల్లి వివాహానికి ఉండడంతో ఉన్న కాస్త భూమి అమ్మితే గానీ పెళ్లి చేయలేమని తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. మృతుడు తల్లి అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి షారుఖ్‌ఖాన్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు శవ పంచనామ నిర్వహించి మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి జహంగీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

నంగునూరు(సిద్దిపేట): మూడురోజుల కిందట పశువులను మేపేందుకు వెళ్లిన వ్యక్తి శనివారం రాజగోపాల్ పేట చెరువులో శవమై తేలాడు. ముండ్రాయి గ్రామానికి చెందిన కోడూరి మల్లయ్య (62) మూడు రోజుల కిందట తన దున్నపోతును మేతకు తీసుకెళ్లి తిరిగిరాలేదు. శనివారం అతని తమ్ముడు చిన్న మల్లయ్య వెతుకుతూ వెళ్లగా రాజగోపాల్‌పేట చెరువులో నీటిపై తేలిన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు.

కారు బీభత్సం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురంలోని బీరంగూడ కమాన్ వద్ద పటాన్‌చెరు వెళ్లే మార్గంలో కారు రోడ్డుపై నిలబడవారిపై దూసుకెళ్లిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. బస్సు కోసం వేచి ఉన్న మహిళలను ఢీ కొట్టింది. ఐదుగురిని ఢీకొట్టగా, అందులో పూజ, రంజాబి పరిస్థితి విషమంగా ఉంది. వీరి కన్నా ముందు రెండు అంబులెన్స్‌లు, ద్విచక్ర వాహనాలను కారు ఢీ కొట్టింది. మితిమీరిన వేగం కారణమని చెబుతున్నారు.


బాధితులకు చికిత్స చేస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


మహమ్ముద్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడటంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్‌కు చెందిన మహమ్ముద్ మియా(69) ప్రస్తుతం హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లి లో ఉంటున్నాడు. లారీ డ్రైవర్ గా పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. శనివారం పటాన్‌చెరు శివారులోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేమాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి భార్య బిస్మిల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ..


రవి(ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మీర్‌పేట్ మండలం బాలపూర్ కు చెందిన షేక్ శభాజ్(24) ఏడాదిగా పటాన్‌చెరు బాయ్స్ హాస్టల్ లో ఉంటున్నాడు. పాశమైలారం పారిశ్రామిక వాడలో ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం షేక్ శభాజ్ బైక్ పై పటాన్‌చెరు నుంచి పాశమైలారం కంపెనీకి బయలుదేరాడు. నవపాన్ సమీపంలో గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి


షేక్ శభాజ్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ విజయ్ కథనం ప్రకారం..మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామానికి చెందిన వడ్ల రవి (45)శనివారం సాయంత్రం పాపన్నపేటలో తలుపు చెక్కలు వేయడానికి వచ్చాడు. తిరిగి బ్రహ్మణి కుంటపై నుంచి వెళ్తుండగా ,ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన రవి అక్కడికక్కడే మరణించాడు. మృతుడికి భార్య జయమ్మ, ఒక కూతురు ఉన్నారు.

యూఓహెచ్‌లో సీటు సాధించిన విద్యార్థిని


శిల్ప

మునిపల్లి(అందోల్): యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(యూఓహెచ్)లో బుదేరా సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి సీటు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆరిఫా తెహసీన్ శనివారం తెలిపారు. తృతీయ సంవత్సరం బీబీఏ చదువుతున్న సీహెచ్ శిల్ప ఇటీవల నిర్వహించిన క్యాట్ పరీక్ష ఫలితాల్లో ఎంబీఏ కోర్సులో యూఓహెచ్‌లో సీటు సాధించినట్లు తెలిపారు. యూనివర్సిటీలో సీటు సాధించినందుకు విద్యార్థినిని అభినందించారు.

అగ్నివీర్‌కు సిద్దిపేట యువతి


రాజేశ్వరిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

సిద్దిపేటఎడ్యుకేషన్: నావికాదళంలో అగ్నివీర్ ఉద్యోగానికి సిద్దిపేట ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాల విద్యార్థిని రాజేశ్వరి ఎంపికై ంది. ఇటీవల కేరళ రాష్ట్రం ఐఎన్ఎస్ కొచ్చీలో జరిగిన అగ్నివీర్ ఎంపిక పోటీల్లో ఆమె ప్రతిభ చూపింది. ఈ సందర్భంగా శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ నావికా దళంలో పనిచేసే అవకాశం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, అధ్యాపకులు కిషోర్, డాక్టర్ సువర్ణదేవి, హరిప్రసాద్ తదితరులు విద్యార్థినిని అభినందించారు.

ఐఐఎంకు జహీరాబాద్ విద్యార్థి ఎంపిక


గౌతం సంకీర్త్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

జహీరాబాద్: కలకత్తాలోని ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో జహీరాబాద్‌కు చెందిన విద్యార్థి సీటు సాధించాడు. తొలిసారిగా ఈ ప్రాంత విద్యార్థి గౌతం సంకీర్త్‌కు సీటు రావడంపై పలువురు సంతోషం వ్యక్తం చేశారు. క్యాట్ ఎంట్రెన్స్‌లో 98 శాతం మార్కులు సాధించాడు. టెన్త్ వరకు జహీరాబాద్‌లో, ఇంటర్మీడియట్, బీటెక్ హైదరాబాద్‌లో అభ్యసించాడు. గౌతం సంకీర్త్ తండ్రి ప్రకాష్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, తల్లి శిరీష ప్రైవేటు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. తమ కుమారుడు సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

వట్‌పల్లి తహసీల్దార్‌కు పదోన్నతి

డిప్యూటీ కలెక్టర్‌గా ఉత్తర్వులు జారీ


రాధాబాయి

వట్‌పల్లి (అందోల్): వట్‌పల్లి తహసీల్దార్ రాధాబాయికి రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించింది. జిల్లాలోని మొగుడంపల్లి, పటాన్‌చెరు, న్యాల్‌కల్, కొండాపూర్ మండలాలల తహసీల్దార్‌గా పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు పదోన్నతి కలిస్తూ శనివారం ఉత్తర్వులు చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలువురు తహసీల్దారులకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి కల్పించిందన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఆమెను అభినందించారు.

ఆదర్శం.. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంటేరు యావదరెడ్డి

కొండపాక(గజ్వేల్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ రైతువేదికలో రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దేవి రవీందర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో టీఎస్‌ఎంఐడీసీ రాష్ట్ర చైర్మన్ ఎర్రోళ్ళ శ్రీనివాస్, ఎన్ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, గజ్వేల్ ఏసీపీ రమేష్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలో వలసలకు సీఎం కేసీఆర్ విముక్తి కలిగించారని కొనియాడారు. కాళేశ్వరంతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్మించి పంటలకు సాగునీరు అందిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో నేటికి రూ.750ల పెన్షన్ ఇస్తున్నారని, తెలంగాణలో మాత్రం రూ.2వేలు అందిస్తున్నట్లు గుర్తుచేశారు. 1.50 కోట్ల మందికి కంట పరీక్షలు చేసి 25 లక్షల మందికి అద్దాలను అందజేసిందని, 60లక్షల మందికి రూ.65కోట్లను రైతుబంధు కింద అందించి సాగుకు వెన్నుదన్నుగా నిలిచిందన్నారు. దశాబ్ది ఉత్సవాలతో రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొందన్నారు. మంత్రి హరీశ్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దశరథం, పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి, కందూరి కనుకవ్వ, బచ్చలి మహిపాల్, ఎంపీటీసీలు విరుపాక ప్రణవీరెడ్డి, చిట్యాల హరితారెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ లగిశెట్టి కనకయ్య, గజ్వేల్ డివిజన్ వ్యవసాయాధికారి బాబునాయక్, ఏఓ ప్రియదర్శిణి, నాయకులు రమేశ్‌రెడ్డి, కోల రవీందర్, రాజలింగం, రైతుబంధు సమితి గ్రామ కమిటీ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు కృతజ్ఞతగా ఉండండి



గౌరవ డాక్టరేట్‌ను అందుకుంటున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

- గీతం పట్టభద్రులకు ఐఎస్బీ వ్యవస్థాపక డీన్ సూచన
- ఘనంగా గీతం 14వ పట్టభద్రుల దినోత్సవం
- గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎస్‌బీ వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా

పటాన్‌చెరు టౌన్: తల్లిదండ్రులు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి తమ పిల్లలను పెద్ద చేస్తారని, వారంతా అధ్యాపకులు, విద్యావేత్తలుకు కృతజ్ఞతా పూర్వకంగా ఉండాలని హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) వ్యవస్థాపక డీన్ ప్రొఫెసర్ ప్రమత్ రాజ్ సిన్హా అన్నారు. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన 14వ పట్టభద్రుల దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోపన్యాసం చేశారు. తరగతి గది లోపల పాఠాల కంటే తరగతి గది వెలుపల పాఠాలు ముఖ్యమైనవన్నారు. ఈ పట్టభద్రుల దినోత్సవాన్ని మానసికంగా గుర్తు పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. తన ఐటీ కాన్పూర్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. గీతం అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్లో ముందుకు సాగేందుకు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. పట్టభద్రుల దినోత్సవంలో భాగంగా, తెలంగాణ శాసన మండలి సభ్యుడు, తెలుగు సాహిత్య ఔన్నత్యానికి విశేష కృషిచేసిన ప్రఖ్యాత రచయిత, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత గోరటి వెంకన్నకు గౌరవ డాక్టరేట్ ఇచ్చి సత్కరించారు. ఎంఏ తెలుగు అత్తెసరు మార్కులతో ఉత్తీర్ణుడైన తనను గీతం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. మంచి సాహిత్యం రాయమని తన తల్లి సలహా ఇచ్చిందని, అటువంటి గ్రామీణ నేపథ్యం తనదన్నారు. గీతంకు కృతజ్ఞతలు తెలియజేశారు. శాస్త్ర విజ్ఞానం ఎంత పెరిగినా సాహిత్యం పాత్ర ఎప్పటికీ తరగదని, కవిత్వం సమాజమంతా బాగుండాలని కోరుకుంటుందన్నారు. గీతం హైదరాబాద్ వార్షిక నివేదికను అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు సమర్పించారు. 1,265 మంది విద్యార్థులు ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్, ఫార్మసీ, హ్యూమనిటీస్ వంటి వివిధ విభాగాలలో డిగ్రీలు పొందడానికి అర్హత సాధించారు. 1,141 మంది విద్యార్థులు, పది మంది పరిశోధకులు పట్టాలను స్వీకరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 21 మంది విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో గీతం కార్యదర్శి ఎం.భరద్వాజ్, ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం, ప్రోవీసీలు డాక్టర్ గీతాంజలి బత్మనాబానే (మెడికల్ సైన్స్), డాక్టర్ కె.గౌతమరావు (క్యాంపస్ లైఫ్), డీన్లు ప్రొఫెసర్ కె.శ్రీకృష్ణ, (సెర్చ్), ప్రొఫెసర్ సి.వి జయశేఖర్ (ఇంజనీరింగ్), ప్రొఫెసర్ విభూతి సచ్దేవ్ (ఆర్కిటెక్చర్), సయ్యద్ అక్బరుద్దీన్ (కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ), అమిత్ భద్ర (మేనేజ్ మెంట్), రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో దీపోత్సవం


శివలింగం, ఓం ఆకృతుల్లో పేర్చిన దీపాలు

కొమురవెల్లి(సిద్దిపేట): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు కొమురవెల్లి మల్లన్న ఆలయంలో శనివారం రాత్రి దీపాలంకరణ చేశారు. వివిధ ఆకృతుల్లో దీపాలను ఉంచి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, స్థానచార్యులు, అర్చకులు, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పలువురికి స్వల్ప గాయాలు


దెబ్బతిన్న కారు వెనుక భాగం


కారును ఢీకొట్టి డివైడర్‌పై నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

కొండపాక(గజ్వేల్): ముందు వెళుతున్న కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక మండలం దుద్దెడ రాజీవ్ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం. జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సిద్దిపేట నుంచి జనగామకు వెళుతుండగా, దుద్దెడ వద్ద ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. అనంతరం బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లింది. బస్సు ఢీకొనడంతో కారు మరో రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలవగా, 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బస్సు డివైడర్‌పై ఆగిపోవడంతో రెండు వైపుల వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అక్కడకు చేరుకొని క్రేన్ సహాయంతో బస్సును జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ భాను ప్రకాష్ తెలిపారు.